

జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

మంచిర్యాలక్రైం, జూన్11(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13న అండర్-19 జిల్లా క్రికెట్ జట్టు ఎంపికను నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పోరండ్ల ప్రదీప్, కోడేటి ప్రదీప్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. 2006 సెప్టెంబర్ 1 తరువాత జన్మించినవారు అర్హులని ప్రతి అభ్యర్థి అర్హులని, అభ్యర్థులు ఆధార్‌కార్డుతో పాటు జనన ధృవీకరణ పత్రం సమర్పించాలని ఆసక్తి గల వారు మంచిర్యాల జడ్పీహైస్కూల్ మైదానంకు సకాలంలో రావాలని తెలిపారు.

పులుల అభయారణ్యంలో ఆంక్షలు ఎత్తివేయాలి

జన్నారం, జూన్11(ఆంధ్రజ్యోతి): పులుల అభయారణ్యంలో ఆంక్షలు ఎత్తివేయాలని కవ్వాల్ పులుల అభయారణ్య ఆంక్షల ఎత్తివేత పోరాట కమిటీ కన్వీనర్ శ్రీరాముల కొండయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అంబేద్కర్ భవన్‌లో అన్ని రాజకీయ పార్టీలు, కుల సంఘాల కార్యాకర్తలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పులుల అభయారణ్యంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పోరాట చైతన్య యాత్రను నిర్వహించాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో తీర్మానించి కార్యవర్గాన్ని ఏర్పాటుచేశారు. కమిటీ కన్వీనర్‌గా శ్రీరాముల కొండయ్య, కోకన్వీనర్లుగా జాడి గంగాధర్, కాశెట్టి లక్ష్మణ్, గూడ అశోక్, మామిడి విజయ్, రవి, భూమాచారి, భూమన్న, ముజాఫర్ అలీ, బద్రీనాథ్, రాజారాంరెడ్డి, బొంతల మల్లేశ్, సలహాదారుగా కోడూరి చంద్రయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అమలుకు నోచుకోని విద్యాహక్కు చట్టం



- 2009 చట్టానికి ఆదిలోనే పాతర
- గత ప్రభుత్వ హయాం నుంచే చట్టానికి తూట్లు
- ఉచిత విద్యకు నోచుకోని పేద విద్యార్థులు
- 25 శాతం అమలులో విద్యాసంస్థల నిర్లక్ష్యం
- కోర్టు ఆదేశాలతోనూ మార్పురాని వైనం
- నేటి నుంచి పాఠశాలల పునః ప్రారంభం

మంచిర్యాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో విద్యాహక్కు చట్టం అమలుకాకపోవడంతో ప్రత్యేక విభాగాలకు చెందిన విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. దేశంలోని 6 నుంచి 14 సంవత్సరాల వయస్సుగల పిల్లలందరికీ తప్పనిసరిగా ఉచిత, నిర్బంధ విద్య అమలు చేయాల్సి ఉంది. ఇందులో భాగంగా పిల్లలకు ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (1వ తరగతి నుంచి ఎనిమిది తరగతులు)ను ఉచితంగా అభ్యసించే హక్కును కల్పించింది. ఏదేని కారణం చేత ఎలిమెంటరీ విద్యను అభ్యసించకుంటే ఎలాంటి ప్రాథమిక విద్య చదవాల్సిన అవసరం లేకుండానే విద్యార్థి నేరుగా తన వయస్సుకు సరిపడా తరగతిలో చేరే అవకాశం ఉంది.

అమలుగాని విద్యాహక్కు చట్టం...

ఎలిమెంటరీ స్థాయిలో పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్య అమలు చేసేందుకు గాను 2009లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేకంగా విద్యాహక్కు చట్టం-2009ని రూపొందించింది. ఇందులో భాగంగా ప్రైవేటు విద్యాసంస్థలు తమ విద్యార్థులకు తప్పనిసరిగా విద్యాహక్కు చట్టం అమలు చేయాల్సి ఉంది. అయితే తెలంగాణలో ఈ చట్టం అమలుకు నోచుకోకపోవడంతోపాటు ఆదిలోనే చట్టం నిర్వీర్యం అయింది. ప్రభుత్వాల వైఖరి కారణంగా ప్రత్యేక అర్హతలుగల విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతోంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాం నుంచే చట్టాన్ని విస్మరించడంతో రాష్ట్రవ్యాప్తంగా ఏ పాఠశాలలోనూ అది అమలు కావడం లేదు.

విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్, ప్రత్యేక పాఠశాలలు 25 శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సి ఉంది. చట్టం ప్రకారం అనాథలు, అంగవైకల్యం గల పిల్లలు, హెచ్‌ఐవీ సోకిన పిల్లలకు పాఠశాలలోని విద్యార్థుల సంఖ్యలో 25 శాతం ఉచిత విద్యను అందించాల్సి ఉండగా, షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ)కు 10శాతం, షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ)లకు నాలుగు శాతం, బలహీనవర్గాలు (బీసీ)కు ఐదు శాతం, మైనారిటీలకు- ఆరు శాతం ఉచితంగా విద్యను బోధించాల్సి ఉంది.



ససేమిరా అంటున్న విద్యాసంస్థలు..

విద్యాహక్కు చట్టంలో భాగంగా ప్రత్యేక అర్హతలు గల విద్యార్థులకు ఉచిత విద్యను అందించేందుకు ప్రైవేటు యాజమాన్యాల కింద పనిచేసే విద్యాసంస్థలు ససేమిరా అంటున్నాయి. బడ్జెట్ పాఠ శాలలను మినహాయిస్తే ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్న కార్పొరేట్, ఇతర ప్రైవేటు విద్యాసంస్థలు చట్టాన్ని తుంగ లో తొక్కడమేగాకుండా, ప్రశ్నించిన వారికి అడ్మిషన్లు కూడా ఇవ్వకుండా వేధిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 200 వరకు ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలు ఉండగా, దాదాపు 60వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఆయా పాఠశాలల్లో ఎక్కడ కూడా విద్యాహక్కు చట్టం అమలు కావడం లేదు. విద్యార్థి సంఘాల నాయకులు..

(మిగతా 7లో)

అన్నా వదిన ఆశీర్వదించండి..

ఎమ్మెల్యే వినోద్‌ను కలిసిన మంత్రి వివేక్

బెల్లంపల్లి/మందమర్రి టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ మంత్రి పదవి రావడంతో బుధవారం హైదరాబాద్‌లో బెల్లంపల్లి ఎమ్మెల్యే జి వినోద్ నివాసానికి వెళ్లి కాళ్లు మొక్కి ఆశీర్వాదం తీసుకున్నాడు. మంత్రిగా రాష్ట్రంలో అభివృద్ధికి మరింత కృషి చేయాలని అందరి మన్ననలు పొందాలని మంత్రి వివేక్‌కు తన అన్నావదినలు సూచించారు. కొన్ని నెలలుగా ఎమ్మెల్యే వివేక్‌తో పాటు ఎమ్మెల్యే వినోద్ మంత్రి పదవి కోసం ఎవరి ప్రయత్నాలు వారు తీవ్రంగా చేశారు. ఎవరికి వారు ఢిల్లీ పెద్దలను తమ రాష్ట్రప్రభుత్వ పెద్దలను కలుస్తూ మంత్రి పదవి కోసం తమవంతు ప్రయత్నాలు చేసుకున్నారు. చివరికి ఎమ్మెల్యే వివేక్‌కు మంత్రి పదవి వరించింది.


ఎమ్మెల్యే వినోద్ దంపతుల ఆశీర్వాదం తీసుకుంటున్న మంత్రి వివేక్

సబ్సిడీపై జీలుగ విత్తనాలు


భీమారంలో జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి

చెన్నూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో యామిని తెలిపారు. చెన్నూరు వ్యవసాయ కార్యాలయంలో 204 క్వింటాలు బ్యాగులు ఉన్నాయని పేర్కొన్నారు. 30 కిలోల బ్యాగు పూర్తి ధర రూ. 4,278 ఉండగా రైతుకు సబ్సిడీపై రూ. 2137 ఉంటుందన్నారు. కావాల్సిన రైతులు పట్టా పాసు పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

భీమారం: భీమారంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో బుధవారం మండల వ్యవసాయాధికారి అత్తె సుధాకర్ రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

తాండూర్: ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో రైతులకు వ్యవసాయ శాఖ ఆద్వర్యంలో బుధవారం 50 శాతం సబ్సిడీతో జీలుగ విత్తనాలను పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి సుష్మ తెలిపారు. ఆమె మాట్లాడుతూ జీలుగ విత్తనాలు కావాల్సిన రైతులను వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నూరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

రైతులపై అటవీ అధికారుల జులుం ఆపాలి


సమావేశంలో మాట్లాడుతున్న సంకె రవి

వేమనపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొన్ని నెలలుగా రైతులు, ఆదివాసీలపై అటవీ అధికారులు చేస్తున్న జులుం ఆపాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సంకె రవి డిమాండ్ చేశారు బుధవారం బుయ్యారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొన్ని నెలలుగా రైతులు, ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూముల్లోకి రానివ్వకుండా ఫారెస్టు అధికారులు అడ్డుకుంటున్నారని, ఇదేంటని అడిగితే దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. రైతులపై దాడులు ఆపకపోతే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామన్నారు. 2006 అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. వెంటనే రైతుల భూములకు పట్టాలు ఇచ్చి సాగు చేసుకోనివ్వాలని, అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మధుకర్, రామన్న, మల్లీశ్వరి పాల్గొన్నారు.

కార్పొరేషన్ హద్దులపై అవగాహన కల్పించాలి

- బీజేపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేత

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటైన మంచిర్యాల కార్పొరేషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ శివాజీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజు మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ల ప్రజలకు అవగాహన కల్పించకుండా అధికార పార్టీ రాజకీయాలకు తలొగ్గి ఇష్టారీతిన డివిజన్లను మార్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని బీజేపీ నాయకులు అన్నారు. ఇప్పటికైనా ప్రజలకు అవగాహన కల్పించి డివిజన్లను ప్రజాఆమోదయోగ్యమైన ప్రక్రియ ప్రకారం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మేడికొండ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు ఆకుల అశోక్‌వర్ధన్, పట్టి వెంకటక్రిష్ణ, పెద్దపల్లి పురుషోత్తం, బోయిని హరిక్రిష్ణ, ఆడెపు కుమారస్వామి, రాజబాబు, మల్లికార్జున్, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్‌రావు, కర్రె లచ్చన్న, పచ్చ వెంకటేశ్వర్లు, పి. రాజేశ్, దుర్గ ప్రసాద్‌రావు, తరుణ్, సిలోజు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

హైటెక్ సిటీ ప్రజలను 52వవార్డులోనే ఉంచాలి

మంచిర్యాలక్రైం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం హైటెక్ సిటీకి చెందిన సభ్యులను 52 వార్డులోనే ఉంచాలని బుధవారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడు ముల్కల్ల సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ హైటెక్‌సిటీ సెకండ్ ఫేజ్‌కు చెందిన కుటుంబాలను జాఫర్‌నగర్ 52వవార్డులో విలీనం చేశారని అలాగే 53కు సంబంధించిన కొన్ని కుటుంబాలను 52వ వార్డులో కలిపారన్నారు. అలాకాకుండా హైటెక్ సిటీ సభ్యులను 52వ వార్డులోనే ఉంచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమణారెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో గాలివాన బీభత్సం



తాండూర్‌లో నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, సీసీసీ కార్నర్ సమీపంలో జాతీయ రహదారిపై పడిన చెట్టు కొమ్మలు

- విరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం

కాసిపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మంగళవారం రాత్రి వీచిన గాలిబీభత్సవానికి చెట్లు విరిగిపోయి కరెంటు వైర్లు నేలకూలాయి. అలాగే కోమటి చేను, కొండాపూర్, రేవులగూడెం, ముత్యంపల్లి, కుర్రెగడ్‌లో ఇంటి పైకప్పు లేచి తడిసిన గోడలతో ఇళ్లు కూలాయి. ఇంట్లో వచ్చిన శబ్దానికి అప్రమత్తమైన కుటుంబసభ్యులు బయటకు వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. నిత్యావసర సరుకులు తడిసిపోయాయి. కోమటి చేనులో కూలిన కూలిన ఇంటిని తహసీల్దార్ బోజన్న బుధవారం పరిశీలించారు. విరిగిన చెట్లకొమ్మల వల్ల కరెంటు వైర్లు తెగిపోవ డంతో పదిగ్రామాలకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. రాత్రంతా ప్రజలు అవస్థలు పడ్డారు.

నస్పూర్: నస్పూర్ పట్టణం సీసీసీ కార్నర్ సమీపంలో వేప చెట్టు మంగళవారం రాత్రి గాలివానకు కొమ్మలు విరిగి రోడ్డు మీద పడడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. వర్షంతో కూడిన గాలి ఒక్కసారిగా రావడంతో వేపచెట్టు కొమ్మలు విరిగి జాతీయ రహదారిపై పడిపోయాయి, కొద్దిసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు, స్థానిక కాంగ్రెస్ నాయకుడు ధర్ని మధుకర్‌తో పాటు పలువురు చేరుకుని ఎక్స్‌కావేటర్ సహాయంతో చెట్టుకొమ్మలను తొలగించారు. బుధవారం సాయంత్రం ఇదే చెట్టు మిగిలిన కొమ్మలు కూడా విరిగి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభంపై పడడంతో స్తంభం విరిగిపోయింది. దీంతో పరిసర ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చెట్టు కొమ్మలు పడడంతో చెట్టు కింద ఉన్న దాదాపు 10 మోటర్ సైకిళ్లు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. చెట్టు కింద ఏవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

తాండూర్: మండలంలో మంగళవారం రాత్రి కురిసిన ఈదురు గాలుతో కూడిన వర్షంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో మండలంలో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈదురుగాలుల తీవ్రతకు తాండూర్ వెళ్లే దారిపై పెద్ద చెట్టు విరిగిపడడంతో రవాణాకు కొద్దిసేపు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తాండూర్ ఎస్‌ఐ కిరణ్‌కుమార్ పోలీసు సిబ్బంది స్థానికుల సహాయంతో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లను తొలగించారు. తాండూర్‌లో ఎనిమిది, అన్నారం, వేణునగర్‌లో ఒక్కో విద్యుత్ స్తంభం నేలకొరగడంతో పాటు ఒక ట్రాన్స్‌ఫార్మర్ నేలకొరిగింది. దాదాపు అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ అధికారులు పునరుద్ధరణ పనులు చేపట్టారు. సుమారు ఐదు లక్షల రూపాయల వరకు నష్టం జరిగిందని విద్యుత్ అధికారులు తెలిపారు.

నేడు కళాశాల భవనం ప్రారంభం

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

లక్సెట్టిపేట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల, కళాశాల భవనాల ప్రారంభోత్సవం గురువారం జరగనుంది. ఏర్పాట్లను మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావుతో కలిసి కలెక్టర్ కుమార్‌దీపక్ బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంబధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కేవలం పది నెలల్లోనే భవనాల నిర్మాణం చేపట్టడం చాలా గొప్ప విషయమన్నారు. ప్రభుత్వం విద్యపై ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతుందని భవనాల ప్రారంభోత్సవంను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీజీఈడబ్ల్యూ ఐడీసీ అశోక్‌కుమార్, జీసీసీ చైర్మన్ కోట్నాక తిరుపతి, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, డీఐవో అంజయ్య, డీఈవో యాదయ్య, డీఆర్‌డీవో కిషన్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్‌చంద్, ఎంఈవో శైలజ, తహసీల్దార్లు దిలీప్‌కుమార్, శ్రీనివాస్ దేశ్‌పాండే, మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నెన్నెల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల రీజినల్ మేనేజర్ దముక ప్రభుదాస్ అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు భవనాన్ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సీఎంటీ రవికిషోర్ రెడ్డి, సీఎంవో రఘువీర్ శర్మ, బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి, ఏపీఎంఎ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను వేగంగా నిర్మించుకోవాలి

మందమర్రిరూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను వేగవంతగా నిర్మించుకోవాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. మండలంలోని పొన్నారంలో ముగ్గు పోసిన ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల ఏఈ జ్యోత్స్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జన్నారం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేండ్లగూడ అటవీ ప్రాంతంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ అనూష తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు కలమడుగు హనుమాన్ ఆలయం, రేయిండ్ల గూడ బస్టాప్ వద్ద ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను బుధవారం పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు ఎల్యాసి మహేశ్, లావుడ్య బద్రుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నా నియోజకవర్గంలో ఎవరి జోక్యం అవసరం లేదు..

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాలక్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల నియోజకవర్గంలో ఎవరి జోక్యం అవసరం లేదని.. నియోజకవర్గానికి నేనే రాజును నేనే మంత్రిని అని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి వస్తే బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు సంబురాల్లో మునిగిపోవడం విచిత్రంగా ఉందన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే మంత్రి అయితే రెండు పార్టీలు తెగ సంతోషించడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. మంచిర్యాల నియోజకవర్గానికి నేనే రాజును నేనే మంత్రిని అన్నారు. ఇక్కడ ఎవరి జోక్యం అవసరం లేదని అన్నారు. మంచిర్యాలలోని ప్రధాన వీధుల సుందరీకరణ పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. రోడ్లు విస్తారంగా ఉంటేనే భావితరాలకు అభివృద్ధిని అందించిన వారమవుతామ న్నారు. రోడ్లవిస్తరణలో కొందరికి నష్టం జరిగినా తరువాత కాలంలో వ్యాపారాలు ఊపందుకుంటాయన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

విశ్వనాథాలయం దుకాణాల సముదాయం కూల్చివేతకు అనుమతి లభించిందని కూల్చివేత పనులు గురువారం ప్రారంభిస్తామన్నారు. వేంపల్లిలో ఐటీ పార్కుకు ఆమోదం ముద్ర పడిందని తెలిపారు. ఆటోనగర్ పరిశ్రమల ఏర్పాటుతో అభివృద్ధితో పాటు స్థానికులకు ఉపాధి లభిస్తుందని వివరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, నాయకులు పూదరి తిరుపతి, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

గూడెం సత్యదేవుడి ఆలయంలో ఏరువాక పౌర్ణమి జాతర

- భక్తిశ్రద్ధలతో స్వామి వారికి పూజలు, సామూహిక వ్రతాలు



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు, స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

దండేపల్లి జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణ స్వామి దేవస్థానంలో బుధవారం వైభవంగా జ్యేష్ఠ ఏరువాక పౌర్ణమి జాతర జరిగింది. ఉదయం నుంచే పలు జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు గూడెంనకు తరలివచ్చి సత్యదేవుడిని దర్శించుకొని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ సమీపంలో పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానం ఆచరించి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సత్యదేవుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామి వారికి వేదపండితులు ఆలయ అర్చకులు నిత్యపూజలు, ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. వందలాది మందికి పైగా భక్తులు కుటుంబ సమేతంగా స్వామి వారి సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించామని ఆలయ నిర్వాహణాధికారి సంకటాల శ్రీనివాస్ వెల్లడించారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

తాండూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయపల్లి గ్రామంలో నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నామని తాండూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర గోండుపిప్రి నుంచి నకిలీ విత్తనాలను తీసుకువస్తుండగా బోయపల్లి గ్రామసమీపంలోని మాసాడి రవీందర్ అనే యువకుడి వద్దనుంచి 18 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ. 54 వేలు ఉంటుందని నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. తాండూర్ వ్యవసాయ అధికారి సుష్మ పర్యవేక్షణలో పంచనామా నిర్వహించామని ఎస్ఐ తెలిపారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భీమారం: మండలంలోని మద్దికల్ శివారులో నకిలీ విత్తనాలను పట్టుకున్నట్లు భీమారం ఎస్ఐ శ్వేత బుధవారం పేర్కొన్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఉదయం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించగా పోలీసులను చూసి తన వద్ద ఉన్న సంచిని వదిలేసి పారిపోయాడన్నారు. సంచిని తనిఖీ చేయగా నకిలీ విత్తనాలు ఉన్నాయన్నారు. మండల వ్యవసాయాధికారి సుధాకర్‌కు సమాచారం ఇవ్వగా ఆయన వచ్చి నకిలీ విత్తనాలుగా గుర్తించారన్నారు. నిందితుడిని ఎల్బీపేటకు చెందిన సూరం సురేష్‌గా గుర్తించి పట్టుకున్నామన్నారు. వ్యవసాయాధికారి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

కౌటాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామానికి చెందిన కమలాబాయి(50) అనే మహిళ మంగళవారం రాత్రి మద్యం మత్తులో గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై విజయ్ తెలిపారు. కమలాబాయి కుమారుడు బందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

హైలెవల్ వంతెన నిర్మాణం ఎప్పుడు?

- ఏటా వర్షాకాలంలో దిందావాసులకు ఇబ్బందులు
- వరదనీరు వస్తే రోజుల తరబడి నిలిచిపోతున్న రాకపోకలు

చింతలమానేపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): చింతలమానేపల్లి మండలం కేతిని- దిందా గ్రామాల మధ్య ఉన్న వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణ పనుల ను ఈ ఎండాకాలంలో కూడా మొదలు పెట్టకపోవడం తో దిందా వాసులకు ఈ వర్షాకాలం ఇబ్బందులు తప్పేలా లేవు. దశాబ్దాలుగా వంతెన నిర్మాణం కోసం గ్రామస్థులు పోరాటాలు సాగిస్తున్నా వంతెన నిర్మాణం మాత్రం చేపట్టడం లేదని వాపోతున్నారు.

బాహ్య ప్రపంచానికి దూరంగా..

భారీ వర్షాలు కురిసి వరద ప్రవహిస్తే రోజుల పాటు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండాల్సి పరిస్థితి నెల కొంటోంది. దిందా గ్రామంలో సుమారుగా 1,500 మం ది జనాభా ఉన్నారు. అటు ప్రాణహిత నది, ఇటు వాగు ఉండడంతో వర్షం పడ్డ ప్రతీసారి వాగు ఉప్పొంగి ప్రవహించడం, అటు ప్రాణహిత నది ఎటూ వెళ్లకుం డా వాగులో నీటి ఉధృతి తగ్గే వరకు వారం నుంచి 15 రోజుల వరకు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండాల్సిన పరిస్థితి. గ్రామంలో ఎవ్వరికి ఏ అవసరం ఏర్పడ్డా ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాగులోంచి నీటి ఉధృతి దాటుకుంటూ ప్రమాదకంగా ప్రయాణం చేయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ వాగు లోంచి ప్రమాదకరంగా దాటుకుంటూ వెళ్తూ ప్రాణాలు పోగొట్టుకున్న సందర్భాలు సైతం ఉన్నాయి. తప్పని పరిస్థితుల్లో ప్రయాణం చేయాల్సి ఉంటుందని గ్రామ స్థులు చెబుతున్నారు. ఈ వంతెన నిర్మాణం చేపట్టాలని గతంలో గ్రామస్థు లు జిల్లా కేంద్రానికి పాదయాత్ర చేపట్టారు. వంతెన వద్ద నిరాహార దీక్షలు, నిరసనలు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు తమ గోడు వినిపించినా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్థులు ఆవే దన చెందుతున్నారు.



ఉప్పొంగి ప్రవహిస్తున్న దిందా వాగు (ఫైల్)



వాగులో ప్రమాదకరంగా దాటుతున్నగ్రామస్థులు (ఫైల్)

నిధులు మంజూరైనా..

వంతెన నిర్మాణం కోసం గతంలో అధికారులు ప్రతిపాదనలు పంపగా పీఎంజేఎస్‌వై నిధుల నుంచి రూ. 3 కోట్లు మంజూరయ్యాయి. కానీ అటవీ అనుమతులు లేకపోవడంతో వంతెన పనులు మొదలు పెట్టలేదు. ఫస్ట్‌ఫేజ్, సెకండ్ ఫేజ్ అనుమతులు వచ్చాయని కాంట్రాక్టర్ నిర్మాణ పనులను మొదలు పెట్టడమే ఆలస్యమని ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటి వరకు ప్రజలకు చెప్పారు. కానీ ఇంకా పనులు మొదలు పెట్టకపోవడం, వర్షాకాలం మొదలు కానుండడంతో దిందా గ్రామస్థులకు వంతెన కల ఈ ఏడాది సైతం నెరవేరేలా లేదు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతిని ధుల పట్టింపు లేని కారణంగానే ఈ వంతెన పనులు ప్రారంభం కావడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా దిందా వాగుపై వంతెన పనులు ప్రారంభించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ హనుమాన్ ఆలయం ఆవర ణలో డీడీఎస్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహిం చారు. డీడీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఒజ్జల శిరీష్ శర్మ మాట్లాడుతూ రాష్ట్రంలోని దేవాదాయ శాఖ అర్చక, ఉద్యోగు లకు దూప దీప నైవేద్యం అర్చకుల సంక్షే మానికి రాష్ట్ర ప్రభుత్వం నిధిని ఏర్పాటు చేయడం హర్షనీయమని అన్నారు. అర్చకుల సంక్షేమం కోసం వివిధ రకాల పథ కాలు ప్రవేశ పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పథకం అమలుకు కృషి చేసి ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజరామయ్యకు, ఎం డోమెంట్ కమిషనర్ వెంకట్రావులకు జిల్లా సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తమకు న్యాయం చేసిందన్నారు. కార్యక్రమంలో అభయ్ అచార్య, సుబ్బా మహేష్ శర్మ, సతీష్ శర్మ, ముత్తయ్యాచారి, విజయ్‌కుమార్ శర్మ, రాంచందర్, శేఖర్ శర్మ, అర్చకులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎఫ్ఆర్వోగా ప్రవీణ్‌కుమార్

సిర్పూర్(టి), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) ఇన్‌చార్జీ రేంజ్ ఆఫీసర్‌గా డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఎఫ్ఆర్వో ఎక్బాల్ హుస్సేన్ వ్యక్తిగత పనుల నిమిత్తం సాధారణ సెలవులపై వెళ్లగా జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ ఆదేశాల మేరకు ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు.

భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ రియాజ్ అన్నారు. మండలంలోని అప్పపల్లి, మోతుగూడలలో బుధవారం భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులు నిర్వహజించారు. భూములలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి గ్రామాల వద్దకే రెవెన్యూ అధికారులు వెళ్లి అర్జీలను స్వీకరించి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రహమత్, జూనియర్ అసిస్టెంట్ రమణ తదితరులు పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మునావర్ షరీఫ్ అన్నారు. మండలంలోని కుంచెవల్లిలో బుధవారం నిర్వహించిన సదస్సులో తహసీల్దార్ మాట్లాడారు. భూమికి సంబంధించిన సమస్యలను దరఖా స్తుల ద్వారా అందజేయాలన్నారు. దరఖాస్తులు పరిశీలించి పరిష్కరించ డానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలోని బోర్లకుంట, కుంచవెల్లి గ్రామాల్లో భూ భారతి సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుల్లో సీనియర్ అసిస్టెంట్ శృతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరు పత్రాలు అందజేత



మంజూరు పత్రాలు అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 5, 11, 18 వార్డులలో అర్హులైన లబ్ధిదారులకు బుధవారం డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాలేష్‌గౌడ్, గోవింద్, కార్తీక్, సాయి, జావీద్, రుహాఫ్, అబ్బు, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు కేటాయించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆర్టీఏ మెంబర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లావుడ్య రమేష్ అన్నారు. ధర్మారం గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దుర్గం దేవాజీ, నాయకులు వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈదురుగాలులు.. వర్షం



సిర్పూర్(యు)లో విరిగిపడిన చెట్టును పరిశీలిస్తున్న అధికారులు

కాగజ్‌నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణం, మండలంలో మంగళవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. పట్టణంలో పలు చోట్ల భారీ వృక్షాలు నేలమట్టం అయ్యాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. మండలంలోని గన్నారం, గజ్జిగూడ, రాస్పెల్లి ప్రాంతాల్లో పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. మండలంలో పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్‌వైర్లపై పడడంతో సరఫరా నిలిపివేశారు. రాత్రి వేళ ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకున్నారు. పలు చోట్ల విద్యుత్ వైర్లు తెగిపడడంతో బుధవారం సరి చేశారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహగాం గ్రామపంచాయితీ పరిధిలో గల అలీగూలో మంగళవారం రాత్రి ఈదురుగాలుల తీవ్రతకు చెట్టు విరిగి ఇళ్లపై పడింది. ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురుగాలులకు అలీగూడ గ్రామానికి చెందిన పెందోర్ లక్ష్మణ్ ఇంటిపైకప్పు లేచి పోయింది.

శానిటరీ కార్మికులకు శిక్షణ

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో బుధవారం శానిటరీ కార్మికులకు శిక్షణ ఇచ్చారు. శిక్షకుడు చైతన్యకుమార్ పలు అంశాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ఆసిఫాబాద్, జూన్ 11 (ఆంధ్ర జ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవనసమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సీతారాంతో కలిసి వైద్యాధికారులతో మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, పైలేరియా, గర్భిణుల సంక్షేమంపై ముందస్తు ప్రణాళిక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా వైద్యాధికారులు, సిబ్బంది ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, పైలేరియా వంటి వ్యాధులు ప్రబల కుండా నియంత్రించాలన్నారు. కలుషిత నీరు తాగడం వల్ల కలిగే వ్యాధల ప్రభావంపై ఆరోగ్య ఆశా కార్యకర్తలతో ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అవసరమైన మందులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తల వద్ద అందుబాటులో ఉంచాలని తెలిపారు. నెలలు నిండిన గర్భిణులను ప్రసవం కోసం ముందస్తు ప్రణాళిక రూపొందించి చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, మిషన్ భగీరథ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ నెల 12వ తేదీ నుంచి విద్యా సంవత్సరంలో పాఠశాలలు, గురుకులాలు, కళాశాలలు ప్రారంభమవుతున్న దృష్ట్యా వంట చేసే సిబ్బంది స్థానికంగా వైద్య పరీక్షలు నిర్వహించి నివేదికలు సమర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

కేజీబీవీని సందర్శించి.. సూచనలు చేసి

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల కేజీబీవీని బుధవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రే సందర్శించి ప్రత్యేకాధికారికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెలవులు ముగించుకొని విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న సందర్భంగా పాఠశాలలోని గదులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు అందించే మెనూలో తాజా కూరగాయలను, నాణ్యమైన నిత్యావసర సరుకులను వినియోగించాలని సూచించారు. వంట సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి నివేదికలు సమర్పించాలని తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బడి బయట, మధ్యలో బడి మానివేసిన పిల్లలు తిరిగి పాఠశాలలకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయన వెంట ఎంఈవో శివచరణ్ కుమార్, కేజీబీవీ ఎస్‌వో మీనా, ఎస్సై ప్రశాంత్ ఉన్నారు.

సింగరేణి సమాచారం

పీఎన్‌బీతో ప్రమాద బీమా ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న సీఎండీ, అధికారులు

శ్రీరాంపూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ నేషనల్ బ్యాంక్‌తో సింగరేణి యాజ మాన్యం బుధవారం ప్రమాద బీమా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు ఒప్పందంపై సంతకాలు చేశారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎండీ ఎన్ బలరాం మాట్లాడారు. ఇతర బ్యాంకుల్లో సింగరేణి ఉద్యోగులు ఖాతాలు కలిగి ఉంటే వారికి కోటి రూపాయల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. కానీ పంజాబ్ నేషనల్ బ్యాంక్ ద్వారా కోటి 25 లక్షల రూపాయలకు ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. సాధారణ మరణా నికి సైతం రూ.10 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ అందిస్తున్నట్లు చెప్పారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సైతం 40లక్షల రూపాయల ప్రమాద బీమా వర్తింపజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్‌వీ సూర్యనారాయణ, ఈడీ(కోల్ మూమెంట్) సుభా నీ, జీఎం(మార్కెటింగ్) రాజశేఖర్ రావు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ హైదరాబాద్ రీజనల్ చీఫ్ జీఎం సునీల్ కుమార్ చుగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చెక్ పోస్టును ప్రారంభించిన జీఎం

రెబ్బెన, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఖైరిగూడ ఓసీపీ వద్ద ఆధునీకరించిన చెక్‌పోస్టును బుధవారం బెల్లంపల్లి జీఎం విజయభాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ చెక్ పోస్టు వల్ల సమయం ఆదా అవుతుందని, సురక్షితంగా బొగ్గు రవాణా జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, ప్రాజెక్టు అధికారి నరేందర్, డీజీఎం(సెక్యూరిటీ) ఉమాకాంత్, ప్రాజెక్టు ఇంజనీర్ వీరన్న, డీజీఎం(సివిల్) మదీనాభాషా తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సురక్షిత తాగునీరు అందజేస్తాం

మందమర్రి టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి ఏరియాలోని కార్మిక కాలనీల్లో సురక్షిత తాగునీరు అందించేందుకు 350 హెచ్‌పీ సబ్‌మెర్సిబుల్ పంపును ఏర్పాటు చేశామని మందమర్రి జీఎం దేవేందర్ అన్నారు. కేకే 3ఏ గని సమీపం లోని చత్లాపూర్ వద్ద ఏర్పాటు చేసిన సబ్ మెర్సిబుల్ పంపును బుధవారం జీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేకే 5 గని నుంచి వచ్చే నీరు సరఫరా కొంత కాలంలో నిలిచిపోనుందని తెలిపారు. కేకే 1 గని నీటిని బోర్‌వెల్స్ ద్వారా పైకి తీసుకురానున్నామని అన్నారు. దీనిని శుభ్రం చేసి కాలనీకు సరఫరా చేయడానికి ఇది ఉపయోగపడుతుందని అన్నారు. కార్మికులకు యాజమా న్యం సురక్షిత నీరును సరఫరా చేయడానికి కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎం ఈ అండ్ ఎం వెంకటరమణ, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, సివిల్ ఎస్ఈ రాము, జయప్రకాష్, కేకే ఓసీ ఇంజనీర్ సంతోష్, సివిల్ సూపర్వైజర్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



పంపును ప్రారంభిస్తున్న మందమర్రి జీఎం దేవేందర్

హామీలు అమలు చేయాలి

రెబ్బెన, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు పర్చాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఏరియా గోలేటి సీహెచ్‌పీలో బుధవారం ఏర్పాటు చేసిన ద్వారా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐటీయూసీ సంఘం కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుపర్చాలని కోరారు. సమావేశంలో టీబీజీకేఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కనీస పెన్షన్ రూ. వెయ్యి అందజేయాలని ఆదేశం

శ్రీరాంపూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కనీస పెన్షన్ వెయ్యి రూపాయలు అంద జేయాలని సీఎంపీఎఫ్ గోదావరిఖని రీజినల్ కమిషనర్ హరి పచౌరి ఆదేశించారు. భీమారం మండలానికి చెందిన లింగం నరసింహారెడ్డి చాలా ఏళ్లపాటు సింగరేణిలో పనిచేసి పెన్షన్ పొందుతూ చనిపోయారు. నిబంధనల ప్రకారం ఆయన భార్య లింగం ప్రేమలతకు 60శాతం పెన్షన్ రావాల్సి ఉంది. అయితే ఈ లెక్కన ఆమెకు కేవలం 744 రూపాయలు మాత్రమే వస్తున్నాయి. కానీ సవరించిన నిబంధనల ప్రకారం కనీస పెనన్ రూ.1000లుగా ఉంది. ఆమె పలుమార్లు అధికారులకు వినతిపత్రం అందించారు. కానీ సమస్య పరిష్కారం కాకపోవడంతో ప్రేమలత సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణుమాధవ్, సింగరేణి విశ్రాంత కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు రాళ్లబండి రాజన్న ద్వారా సీఎంపీఎఫ్ గోదావరిఖని రీజనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ధన్‌బాద్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు లేఖ రాశారు. దీని ప్రతిని ధన్‌బాద్‌లోని సీఎంపీఎఫ్‌ఓ రీజినల్ కమీషనర్, కొత్తగూడెంలోని సింగరేణి డైరెక్టర్(పా)కు కాపీని పంపించారు. దీంతో ప్రేమలత హర్షం వ్యక్తం చేశారు. సమస్య విన్నవించిన వెంటనే స్పందించిన సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్ హరి పచౌరీకి సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణుమాధవ్, సింగరేణి విశ్రాంత కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు రాజన్న ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కేకే 5 మేనేజర్ పాండే

గైర్హాజరుతో ఉద్యోగాలు కోల్పోతారు

మందమర్రి టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రతి నెల కార్మికులు సక్రమంగా విధులకు హాజరు కాక నాగాల పేరుతో ఉద్యోగాలు కోల్పోయే అవకాశాలు అధికంగా ఉంటాయని కేకే 5 గని మేనేజర్ శంబునాథ్ పాండే తెలిపారు. గని క్యాంటీన్ హాల్‌లో బుధవారం గైర్హాజరు అయ్యే కార్మికుల కౌన్సెలింగ్‌లో ఆయన మాట్లాడారు. ఇటీవల సీఎండీ బలరాం గైర్హాజరు కార్మికుల సమస్యలను తెలుసుకొని విధులకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారని చెప్పారు. భూగర్భ 16, ఉపరితల 20 మస్టర్లు తప్పకుండా చేయాలని తెలిపారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వెంటిలేషన్ అధికారి శంకర్, సంక్షేమాధికారి రవళి, ఆఫీస్ సూపరింటెండెంట్ బుచ్చయ్య, పాల్గొన్నారు.

పోడు రైతులను అడ్డుకుంటే పోరాటం

కెరమెరి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తరతరాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూముల్లోకి రైతులు వెళ్లకుండా అటవీ అధికారులు అడ్డుకుంటే పోరాటం తప్పదని సీఐటీయూ మండల కన్వీనర్ ఆనంద్‌రావు అన్నారు. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగు భూములపై అటవీ శాఖ దౌర్జన్యాలు మానుకోవాలన్నారు. సాగు భూములపై ఆధారపడి జీవిస్తున్న వారిపై అక్రమ కేసులు పెట్టడం, ట్రాక్టర్లను గుంజుకోవడం, రైతులను బలవంతంగా వెళ్లగొట్టడం సరికాదని చెప్పా రు. వెంటనే వారి వేధింపులు మానుకోవాలని హెచ్చరించారు.

వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాలి

ఆసిఫాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలు తమ వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాలని జిల్లా రవాణాధికారి రాంచందర్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా నడుపుతున్న బస్సులను గుర్తించడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లు నిర్వహిస్తామని తెలిపారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

జైనూర్, జూన్ 11 (ఆంధ్రజోతి): నకిలీ విత్తనాల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని జైనూర్ ఎస్ఐ రవికుమార్ అన్నారు. మండలంలోని పాట్నాపూర్‌లో బుధవారం గ్రామస్థులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. యువత వ్యసనాల బారిన పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనుమానాలు ఉంటే సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో జగన్నాథ్, సుదర్శన్, మహేష్, లతీఫ్ పాల్గొన్నారు.

టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా చిట్ల సత్యనారాయణ

మంచిర్యాలక్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు కృషితోనే తనకు తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ ఉపాధ్యక్ష పదవి వరించిందని చిట్ల సత్యనారాయణ అన్నారు. ప్రేంసాగర్‌రావుకు రుణపడి ఉంటానన్నారు. ఈ పదవికి సహకరించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

జర్నలిస్టు మునీర్‌కు నివాళి

శ్రీరాంపూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మరణించిన సీనియర్ జర్నలిస్టు మునీర్‌కు నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు భూపతి రవి, కొండా శ్రీనివాస్ పూలమాల వేసి అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో సభ్యులు భాస్కరి రాజేశం, ఏల్పుల మల్లేష్, కోడం రవి, బియ్యాల రాజ్‌కుమార్, క్యాతం రాజేశ్, మైదం రామకృష్ణ, పాదం నర్సయ్య, నరేందర్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

12న కేబుల్ టీవీ ఆపరేటర్ల ధర్నా

శ్రీరాంపూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు కేబుల్ టీవీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గూడ రాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అధికారులు పోల్‌టాక్స్ చెల్లించాలని తమపై ఒత్తిడి చేస్తున్నార న్నారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 12వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, కేబుల్ టీవీ ఆపరేటర్లు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు.

పాఠాలు ఎలా చెబుతారు..



- బోధన తీరును పరిశీలించనున్న విద్యాశాఖ
- ఇక నుంచి పాఠశాలల్లో అధికారుల తనిఖీలు
- నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం

కోటపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు గురువారం నుంచి పునః ప్రారంభం కానుండగా పాఠశాలల్లో ఉపాధ్యాయులు పాఠాలు ఎలా బోధిస్తున్నారో పరిశీలించేందుకు విద్యాశాఖ సమాయత్తమైంది. పాఠశాలల పనితీరు ఎలా ఉంది... ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాలు ఎలా ఉన్నాయి... విద్యార్థులు అభ్యాసన సామర్థ్యాలు ఎలా ఉన్నాయి లాంటి అంశాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు విద్యాశాఖ తనిఖీలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఇందుకోసం వివిధ స్థాయిల్లోని అధికారులు తనిఖీలు చేసేలా విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలల పునః ప్రారంభం రోజునుంచే ఈ తనిఖీలు చేపట్టేందుకు విద్యాశాఖ సిద్ధమవుతోంది. ప్రతీ రోజు ఎవరో ఒకరు ఏదో ఒక పాఠశాలను తనిఖీ చేసేలా కార్యచరణ సైతం రూపొందించారు. తద్వారా పాఠశాలల్లో నాణ్యమైన గుణాత్మకమైన విద్యను అందించడంతో పాటు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుకు సంబంధించిన అంశాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదించేందుకు అవకాశం ఉంటుంది. దీంతో విద్యా రంగాన్ని బలోపేతం చేసే దిశగా విద్యాశాఖ రోజు వారీ తనిఖీలకు శ్రీకారం చుట్టనుంది.

● హెచ్‌ఎం నుంచి డైరెక్టర్ స్థాయి వరకు

పాఠశాలల తనిఖీలు నిర్వహించేందుకు స్కూల్ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ నుంచి విద్యాశాఖ డైరెక్టర్ స్థాయి వరకు ప్రతీ ఒక్కరు పాఠశాలల తనిఖీలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. విద్యాశాఖ డైరెక్టర్, హెచ్‌వోడీలు, అడిషనల్ డైరెక్టర్లు, జాయింట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లతో పాటు ఇతర రాష్ట్రస్థాయి అధికారులు వారంలో కనీసం ఒక్కరోజు రెండు పాఠశాలలను సందర్శించి పూర్తిస్థాయిలో వివరాలను రాబట్టాలి. అంటే నెలలో ఎనిమిది నుంచి 10 పాఠశాలలను సందర్శించేలా ప్రణాళికలు రూపొందించారు. అలాగే ఆర్జేడీలు, జిల్లా విద్యాశాఖ అధికారులు వారానికి రెండురోజు కనీసం మూడు లేదా నాలుగు పాఠశాలలను నెలలో 12 నుంచి 16 పాఠశాలలను సందర్శించాలి. ఎంఈవోలు, సమగ్ర శిక్ష క్వాలిటీ కో ఆర్డినేటర్లు వారానికి మూడు రోజుల్లో ఐదు నుంచి ఆరు స్కూళ్లు, నెలలో 20 నుంచి 24 స్కూళ్లను సందర్శించి అక్కడి వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాలి. ఇక వీరితో పాటు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, వారానికి రెండు రోజులు కనీసం నాలుగు నుంచి ఐదు స్కూళ్లను సందర్శించాలి. అంటే నెలలో 16 నుంచి 20 స్కూళ్లను సందర్శించి సంబంధిత పాఠశాలల్లో వారు గమనించిన పాఠ్యాంశాల బోధన, పాఠశాల నిర్వహణ తీరు విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలకు సంబంధించిన నివేదికలను ఉన్నతాధికారులకు అందించాల్సి ఉంటుంది.

● అభ్యసన సామార్థ్యాలు పెంచేలా...

పాఠశాలలను పర్యవేక్షించడం ద్వారా విద్యార్థులు అభ్యసన స్థాయిలను పెంచడంతోపాటు ఉపాధ్యాయుల బోధన సామార్థ్యాలు పెరిగేందుకు అవకాశం ఉంటుంది. ఎఫ్ఎల్ఎన్, లిప్ లాంటి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ తనిఖీలు ఉపయోగపడనున్నాయి. అంతేకాకుండా తనిఖీలను నామమాత్రంగా నిర్వహించవద్దని తనిఖీలు చేసే అధికారులు పాఠశాలల్లో కనీసం రెండు నుంచి మూడు గంటల పాటు ఉండాలని ఉపాధ్యాయుల బోధన సామార్థ్యాలను అంచనా వేసి ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి అకాడమిక్ గైడెన్స్ రిజిష్టర్‌లో సమాచారాన్ని పొందుపర్చి దాన్ని ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అలాగే పాఠశాలను సందర్శించి పూర్తి సమాచారాన్ని తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో పొందుపర్చాలి.

ఇక ప్రతీ నెల 28న ఎంఈవోలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో జిల్లా విద్యాశాఖ అధికారులు జిల్లాస్థాయిలో సమావేశాలు నిర్వహించి పాఠశాలల సందర్శనలో గమనించాల్సిన అంశాలపై సమీక్ష చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు బోధన సామార్థ్యాలపై రెండు విడతలుగా శిక్షణ ఇవ్వగా పాఠశాలల పరిసరాలపై, మధ్యాహ్న భోజనం నిర్వహణపై సంబంధిత వంట ఏజెన్సీలకు, పారిశుధ్య కార్మికులకు సైతం ఓరియంటేషన్ శిక్షణ ఇచ్చారు. దీన్ని కూడా తనిఖీల్లో దృష్టిలోకి తీసుకోనున్నారు. పాఠ్యాంశాల బోధనపై పర్యవేక్షణ ఫలితంగా ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాలపై విద్యార్థుల అభ్యసన స్థాయిలు పెరగడానికి అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

అమలుకు నోచుకోని విద్యాహక్కు చట్టం

(5వ పేజీ తరువాయి)

ప్రైవేటు బడుల్లో విద్యాహక్కు చట్టం అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ విషయమై దృష్టిసారించకపోవడంతో చట్టం నిర్వీర్యమయ్యే పరిస్థితులు ఉన్నాయి. ఇదిలా ఉండగా గురువారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. విద్యా సంవత్సరం ఆరంభం నుంచే విద్యాహక్కు చట్టం అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపడితే ప్రత్యేక అర్హతలుగల విద్యార్థులకు మేలు చేకూర్చినట్లు అవుతుంది.

● కోర్టు ఆదేశాలు అమలయ్యేనా?

పేదలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో 25 శాతం రిజర్వేషన్ల కల్పనపై హామీఇవ్వాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రైవేటు విద్యా సంస్థల్లో పేద విద్యార్థులకు 25 శాతం అమలుకోసం జారీ చేసిన మెమోను నిజమైన స్ఫూర్తితో అమలు చేస్తామని అండర్ టేకింగ్ కోరింది. రాష్ట్రంలో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయడం లేదంటూ 2020లో హైకోర్టులో పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఇదే విషయమై దేశ సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టు కూడా రెండుసార్లు విచారణ చేపట్టింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది అక్టోబరు 19న మెమో జారీ చేసినా ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. హైకోర్టు ఆదేశాలతో ఈ విద్యా సంవత్సరం నుంచైనా రాష్ట్రంలో విద్యాహక్కు చట్టం అమలుకు నోచుకుంటుందా? లేదా అనే సందేహాలు వ్యక్తమమతున్నాయి.

మోదీ ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కన్నెపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ 11 సంవత్సరాల పాలనలో సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మాడవెల్లిలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏమాజీ మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. మోదీ ప్రభుత్వ విజయాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆశన్న, నాయకులు గోవర్ధన్, కేశవరెడ్డి, సంతోష్‌కుమార్, రాజయ్య, శ్రావణ్‌కుమార్, అరవింద్ , పోశం, సాయిపటేల్ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: ప్రధానిగా నరేంద్రమోదీ 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో వెల్గనూర్, నంబాల, గూడెం, కన్నెపల్లి గ్రామాల్లో బుధవారం మొక్కలు నాటారు. బీజేపి మండల అధ్యక్షుడు బందెల రవిగౌడ్, మాజీ అధ్యక్షుడు గోపతి రాజయ్య, గూడెం పీఏసీఎస్ చైర్మన్ సురేష్, పార్టీ ప్రధాన కార్యదర్శులు పత్తిపాక సంతోష్, ముత్తె అనిల్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా విజిత్ జన్మదిన వేడుకలు

నస్పూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రాష్ట్ర నేత నడిపెల్లి విజిత్ కుమార్ జన్మదిన వేడుకలు బుధవారం నస్పూర్ పట్టణంలోని షిర్కే కాలనీ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అక్కురి సుబ్బయ్య, నాయకులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని సాయి అంధుల పాఠశాలలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

భక్తుల గిరిప్రదక్షిణ

లక్సెట్టిపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీలక్ష్మి వెంకట నరసింహుని ఆలయంలో జేష్ట పౌర్ణమి సందర్భంగా భక్తులు బుధవారం గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, హనుమాన్ భక్త బృందం భజన కార్యక్రమాలను నిర్వహించారు.

మంత్రి, ఎమ్మెల్యేకు సన్మానం



మంత్రి వివేక్, ఎమ్మెల్యే వినోద్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బెల్లంపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌కు మంత్రి పదవులు రావడంతో బెల్లంపల్లి నియోకవర్గంలోని నాయకులు ఎమ్మెల్యే వినోద్ ఆధ్వర్యంలో బుధవారం మంత్రి వివేక్‌ను సన్మానించారు. వివేక్‌కు మంత్రి పదవి రావడంతో మంచిర్యాల జిల్లాతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సైతం అభివృద్ధి పథంలో నడుస్తుందని ఆశాబావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునిమంద రమేశ్, నర్సింగరావు, హరీశ్‌గౌడ్, చిలుముల శంకర్, అశోక్‌గౌడ్, మహేందర్, మురళీధర్‌రావులు పాల్గొన్నారు.


నెన్నెల: మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని నేతకాని మహర్ సేవా సంఘం నాయకులు బుధవారం హైదరాబాదులో కలిశారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. నేతకాని మహర్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం సిద్ధార్థ రామ్మూర్తి, యువ నాయకులు దుర్గం కుమార్, గజ్జె మహేందర్, జనగామ తిరుపతి, గోదారి వేణు ఉన్నారు.

మందమర్రిరూరల్: ఇటీవల మంత్రిగా నియామకమైన చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామిని కాంగ్రెస్ నాయకులు బుధవారం హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్చాలు అందించారు. కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి కడారి జీవన్‌కుమార్, సంతోష్‌కుమార్, మాజీ సర్పంచు రాజేష్, పెంచాల రాజలింగు, పున్నం, కుమార్, ఒడ్నాల కొమురయ్య, ఏనుగు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రేణుక ఎల్లమ్మ జాతర

వేమనపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజారం గ్రామంలో వెలిసిన రేణుక ఎల్లమ్మ జాతర బుధవారం రాత్రి ముగిసింది. రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఈ జాతరలో గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. నైవేద్యాలు సమర్పించి బోనాలు పోశారు. అక్కడే విందు ఆరగించారు. చాలా మంది కోళ్లు, మేకలను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి రేణుక ఎల్లమ్మ విగ్రహంతో రథోత్సవం నిర్వహించారు. ఈ జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోలి వేణుమాధవ్‌రావు, నాయకులు పురాణం లక్ష్మీకాంత్, కుబిడె వెంకటేశం, కొండగొర్ల బాపు, ప్రజలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మందమర్రిరూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎంపీడీవో రాజేశ్వర్‌కు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 16 నెలలుగా పంచాయతీలకు పాలకవర్గం లేకపోవడంతో ఇబ్బందులు పడుతూ పనిచేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం లక్షలాది రూపాయలు అప్పులు తీసుకువచ్చి అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని వాటి బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. ట్రాక్టర్ డీజిల్ బిల్లులు, ఇతర బిల్లులు లక్షలాది రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయని వారు పేర్కొన్నారు. గ్రామాల నిర్వహణ తమకు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బిల్లులు విడుదల చేయాలని, సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రశాంత్, వీరేందర్, సురేష్, రమేష్, విద్యాలత, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

హాజీపూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించేలా కృషి చేయాలని డీఆర్‌డీవో కిషన్ సూచించారు. బుధవారం హాజీపూర్ మండల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో అమ్మ మాట అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అంగన్వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు స్వాగతం పలికారు. మొదటి రోజు కేంద్రాల ప్రారంభోత్సవంలో భాగంగ చిన్నారులకు ఎగ్ బిర్యాని అందించారు. డీఆర్‌డీఏ కిషన్ పడ్తన్‌పల్లి, రాపల్లి-2అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి పనితీరు పర్యవేక్షించారు. కార్యక్రమంలో సీడీపీవో విజయలక్ష్మీ, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, సూపర్ వైజర్ సంధ్యరాణి,లు పాల్గొన్నారు.

చెన్నూరు: మండలంలోని సుబ్బరాంపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అమ్మమాట అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి 3 సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూపర్ వైజర్ మాధవి తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం చిన్నారులకు ఎగ్ బిర్యాని భోజనం పెట్టారు.



సుబ్బరాంపల్లిలో ఎగ్ బిర్యానితో భోజనం చేస్తున్న చిన్నారులు

దండేపల్లి: మూడేళ్ల నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ లక్సెట్టిపేట ప్రాజెక్టు సీడీపీవో రేష్మ కోరారు. దండేపల్లి మండలం గూడెం సెక్టార్‌లో కన్నెపల్లి, గూడెం అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మ మాట అంగన్‌వాడి బాట కార్యక్రమాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. అమ్మ మాట అంగన్‌వాడిబాట కార్యక్రమాల్లో భాగంగా గ్రామాల్లోని చిన్నారులతో కలిసి ర్యాలీ చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి పిల్లలకు సామూహిక అక్షర అభ్యాసం చేయించి, ఎగ్ బిర్యానీ తినిపించారు. కార్యక్రమంలో గూడెం సెక్టార్ సూపర్‌వైజర్ల జె వెంకటలక్ష్మి, ఏఎన్ఎంలు విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు శైలజ, స్వప్న, రమ, వసంత, స్వరూప, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలక్రైం: పాత మంచిర్యాల నాలుగో అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా చిన్నపిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ విజయ, ఎస్‌డబ్ల్యూజీ సభ్యులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలోని హనుమాన్ బస్తీలో స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమ్మమాట అంగన్‌వాడీ బాట అనే కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు. సీడీపీవో స్వరూప, సూపర్‌వైజర్ ప్రసన్న, అంగన్‌వాడీ టీచర్లు పద్మావతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ధూపదీప నైవేద్య రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీకాంత స్వామి

జన్నారం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ధూపదీప నైవేద్య రాష్ట్ర అధ్యక్షుడిగా పెరంబూర్ శ్రీకాంత్‌చారిని నియమించి నట్లు జేఏసీ చైర్మన్ ఉపేంద్రశర్మ తెలిపారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని విశ్వనాథ ఆలయంలో బుధవారం రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో శ్రీకాంత్ స్వామి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ధూపదీప నైవేద్య రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు జేఏసీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే భూ భారతి

తాండూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి గొప్ప వేదిక భూ భారతి చట్టం అని తహసీల్దార్ జ్యోత్స్న అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపల్లి భూభారతి రెవెన్యూ సదస్సులో రైతులకు భూ భారతి చట్టంపై అవగాహన కల్పించారు. అనంతరం 95 దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అజాజుద్దీన్, జూనియర్ అసిస్టెంట్ పద్మ, రికార్డు అసిస్టెంట్ రాజేశ్వరి, సిబ్బంది హన్మంతు పాల్గొన్నారు.

బస్సుపాస్ చార్జీలను తగ్గించాలి

బెల్లంపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పెంచిన ఆర్టీసీ బస్సు పాస్ చార్జీలను తగ్గించాలని కోరుతూ బుధవారం ఆర్డీవో కార్యాలయంలోని అధికారి గురువయ్యకు ఎంసీపీఐయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. విద్యార్థులకు, మధ్య తరగతి విద్యార్థులకు ఆర్థికభారం అవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేంద్రప్రసాద్, వెంకటేశ్, రమేశ్, రాజశేఖర్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బడిబాట

లక్సెట్టిపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలను బడిలో చేర్పించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బడిబాట కార్యక్రమం బుధవారంతో ముగిసింది. అన్నిప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామాల్లో తిరుగుతూ ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించాలని కోరుతూ అవగాహన కల్పించారు. మండలంలోని వెంకట్రావుపేట అంగన్‌వాడీ సెంటర్‌లో బడిబాట కార్యక్రమంలో భాగంగా అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతీ ఒక్కరూ చిన్న పిల్లల ను అంగన్‌వాడీ సెంటర్‌కు తీసుకువచ్చి పేరు నమోదు చేయాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు శారధ, సుగుణ, లత, కమిటీ సభ్యులు, మహిళలు, చిన్నారులు తల్లిదండురలు పాల్గొన్నారు.

జైపూర్: ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులను చేర్పించాలని జైపూర్ 1 అంగన్‌వాడీ టీచర్ మద్దుల సరిత పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి బడిబాట ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు పెడుతున్న భోజన మెను, పుస్తకాలు, ప్రభుత్వం కల్పించే ఉచిత సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్లు అందజేత



సెల్‌ఫోన్లను అందజేస్తున్న ఏసీపీ, ఎస్‌హెచ్‌వో

బెల్లంపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న ఫోన్లను బుధవారం ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ రవికుమార్ ఫోన్లను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఎవరైన వారి సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని ఫిర్యాదు చేసిన వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్‌కు సెల్‌ఫోన్ వివరాలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో దేవయ్య పాల్గొన్నారు.

పంటమార్పిడితోనే సుస్థిర ఆదాయం: కేవీకే శాస్త్రవేత్తలు

భీమిని, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట మార్పిడితో అధిక దిగుబడులు సాధిస్తూ, సుస్థిర ఆదాయాన్ని పొందవచ్చని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ప్రియాసుగంధి, నాగరాజు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, వికసిత కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. ఏళ్ల తరబడి ఒకే పంట సాగు చేస్తే ఆశించిన దిగుబడులు రావన్నారు. వరి, పత్తి పంటలే కాకుండా ఇతర పంటలు కూడా సాగు చేయాలని సూచించారు. ఈ ప్రాంత నేలలు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నాయన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తే ప్రభుత్వం రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తుందన్నారు. సాగు లాభసాటిగా మారేందుకు ఆధునిక పద్ధతులు పాటించాలన్నారు. అధిక రసాయన ఎరువుల వాడకం తగ్గించి వృధా ఖర్చులు అరికట్టాలన్నారు. విత్తనోత్పత్తి, సస్యరక్షణ చర్యలు, సాగు నీటి నిర్వహణ, ఎరువుల, విత్తనాల రసీదులు బద్రపర్చుకోవడం సహా అనేక అంశాలపై అవగాహన కల్పించారు. విత్తనాలు ఎలా ఎంపిక చేసుకోవాలో వివరించారు. అనంతరం రైతులకు సబ్సిడీ జీలుగ విత్తనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భీమిని ఏడీఏ సురేఖ, మ్యాట్రిక్స్ సీఈవో ఉదయ్‌కిరణ్, భీమిని ఏవో యమున, ఏఈవోలు వినోద్, కార్తీక్, అఫ్రోజ్‌పాష, పీఏసీఎస్ సీఈవో సంగర్స్ రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ నాగరాజు

సమస్యల వలయంలో ప్రభుత్వ పాఠశాలలు

-పట్టించుకోని ప్రభుత్వం


తాండూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తాండూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. కొన్నిచోట్ల మౌలిక వసతులు లేకపోవడం, తరగతి గదుల కొరత, పరిశుభ్రత లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. కొన్ని పాఠశాలలు పురాతన భవనాల్లో ఉండడం వల్ల వర్షం కురిస్తే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

- శిథిలావస్థలో పాఠశాలల భవనాలు

మండలంలోని కొన్ని పాఠశాలలు శిథిలావస్థలో ఉన్నాయి. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గోడలు పగుళ్ల తేలడం, పైన స్లాబ్ పెచ్చులూడుతుండడంతో విద్యార్థులు భయంగా చదువులు కొనసాగిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో తరగతి గదులు సరిపోక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. పాఠశాలల ప్రారంభానికి ముందే శిథిలావస్థలో ఉన్న పాఠశాలలను నూతన భవనంలోకి మార్చడం లేదా మరమ్మతులు చేయించడం వంటివి ప్రభుత్వం చేయకపోవడంతో విద్యార్థులు భయంగానే చదువులను కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది. శిథిలావస్థలో ఉన్న అచ్చలాపూర్ ఉన్నత పాఠశాలలో కిటికీలకు తలుపులు లేక కోతులు, పాములు తరగతి గదుల్లోకి వస్తున్నాయి. దీంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు.

- అపరిశుభ్రంగా పరిసరాలు...

మండలంలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల్లో పరిశుభ్రత చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



తాండూర్‌లోని సుభద్ర కాలనీలో శిథిలావస్థలో ఉన్న మరుగుదొడ్లు, శిథిలావస్థలో ఉన్న తాండూర్ ప్రైమరీ స్కూల్

సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేస్తాం

- మల్లేశం, ఎంఈవో, తాండూర్

పాఠశాలల్లోని ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. అలాగే పాఠశాలల ప్రారంభం రోజు ఉపాధ్యాయులందరూ హాజరుకావాలి. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు అందించాలి.

అధికారుల నిర్లక్ష్యంతోనే ఉద్యోగికి ప్రమాదం

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలోని 220కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈఏడీ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని 327 యూనియన్ నాయకులు ఎస్‌ఈ వెంకటేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కాలిన గాయాలతో హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో దేవయ్య చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతన్నాడన్నారు. ప్రభుత్వ ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో 327 యూనియన్ ట్రెజరర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను కాపాడుకునే బాధ్యత అందరిది

జన్నారం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్‌జోన్‌లోని ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలో గల నార్లాపూర్ సౌత్‌బీట్‌లో ఇంధన్‌పల్లి రేంజ్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో బుధవారం అటవీ శాఖ అధికారులు పర్యటించారు. వర్షాకాలంలో నాటే చెట్లతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రణాళికలు సిద్ధం చేశారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.



- విద్యార్థులకు ముగిసిన వేసవి సెలవులు
- పంపిణీకి పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు సిద్ధం
- తొలి రోజే అందించేందుకు అధికారుల ఏర్పాట్లు

వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభమవుతున్నాయి. వేసవి సెలవుల్లో ఆటాపాటలు, షికార్లతో గడిపిన విద్యార్థులు ఇక పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిందే. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేర్పించేందుకు ఉపాధ్యాయులు ఈ నెల 6 నుంచి బడిబాట నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం కల్పించే వసతులు, బోధన, గతేడాది వచ్చిన ఫలితాలను తల్లిదండ్రులకు వివరిస్తూ పాఠశాలల్లో చేర్పించాలని సూచిస్తున్నారు.

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు విద్యార్థులకు ఆటా పాటలతో సరదాగా గడిచి పోయాయి. ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపిన విద్యార్థులు గురువారం నుంచి పాఠశాలలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. వేసవంతా బోసిపోయిన స్కూళ్లు గురువారం నుంచి పునః ప్రారంభంతో మళ్లీ కళకళలాడనున్నాయి. విద్యార్థులకు పాఠ్య పుస్తకాల ఇబ్బందులు లేకుండా జిల్లా విద్యా శాఖ ముందస్తు చర్యలు తీసుకున్నది. పాఠ్య పుస్తకాలు ఇప్పటికే పాఠశాలలకు సరఫరా చేసింది. వేసవి సెలవులను పిల్లలు బాగా ఆస్వాదించారు. ఆట పాటల్లో మునిగి తేలారు. అయితే వేసవి సెలవులు బుధవారంతో పూర్తి కానుండగా గురువారం నుంచి విద్యార్థులు మళ్లీ బడిబాట పట్టనున్నారు. వారిని సిద్ధం చేసి బడికి పంపేందుకు తల్లిదండ్రులుటు ఏర్పాట్లు చేసుకున్నా రు. సెలవులతో బోసి పోయిన పాఠశాలలు గురువా రం నుంచి కళకళ లాడనున్నాయి.

జిల్లాలో 731 పాఠశాలలు..

జిల్లాలో మొత్తం 731 పాఠశాలలతో పాటు గిరి జన, కేజీబీవీ, మోడల్‌స్కూల్, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 561 ప్రాథమిక, 100 ప్రాథమికోన్నత, 60 ఉన్నత పాఠశాలలున్నాయి. ఇందులో మొత్తం 47,530 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. జిల్లాలో 2447 మంది ఉపాధ్యాయ పోస్టులకు గాను 2072 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. జిల్లాలో ఇంకా 375 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేస్తే విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అం దించే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం దృష్టి సారించి ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రారంభం రోజే పుస్తకాలు అందజేస్తాం.. యాదయ్య, డీఈవో



జిల్లాలో పాఠశాల విద్యార్థులకు బడుల ప్రారంభం రోజే పుస్తకాలు, ఒకజత ఏకరూప దుస్తులు అందజేస్తాం. ఇది వరకే విద్యార్థుల కొలతలను సేకరించి ఏకరూప దుస్తులను మహిళా సంఘాలతో కుట్టించే ప్రక్రియ పూర్తి చేశారు. విద్యార్థులకు తొలిరోజే అందజేసేందుకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లను ఇది వరకే పాఠశాలలకు పంపిణీ చేశాం.

ప్రారంభానికి ముందే..

ఈ ఏడాది పాఠశాలల పునః ప్రారంభానికి ముందే ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలను ప్రభుత్వం సరఫరా చేసింది. విద్యార్థుల ఎకరూప దుస్తుల కోసం 97,786 మీటర్ల క్లాత్ రాగ వాటిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో కుట్టించారు. ఈ మేరకు ఆయా పాఠశాలలకు దుస్తులను పంపించారు. 3,54, 50 పాఠ్యపుస్తకాలకుగాను, 3,33,760 పాఠ్య పుస్తకాలు వచ్చాయి. 2,81,464 నోట్‌బుక్‌లు జిల్లా కేంద్రానికి చేరుకోగా వాటిని అయా పాఠశాలలకు పంపిణీ చే శారు. ఏటా జూన్‌లోపాఠశాలలు పునఃప్రారంభమై నెల రోజులు గడిచినా పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందని సందర్భాలే ఎక్కువగా ఉన్నాయి. కానీ ఈ విద్యా సంవత్సరంలో ముందే ప్రణాళిక రూపొందించి అమలు చేశారు.



పాఠ్య పుస్తకాలను అందజేస్తున్న ఎంఈవో సుభాష్

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

వాంకిడి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం భూ భారతి రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లాలోని వాంకిడి మండలం అర్లి గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును బుధవారం సందర్శించి అర్జీదారుల సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం భూ భారతి నూతన ఆర్‌ఓఆర్ చట్టం అమలులో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రెవెన్యూ సదస్సులు వచ్చిన ప్రతి దరఖాస్తును రిజిస్టర్‌లో నమోదు చేసి రికార్డులతో సరి చూసి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వివిధ రకాల సమస్యలపై వచ్చిన దరఖాస్తులను కేటగిరిల వారీగా వేరే చేయాలని దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించాల్సిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించి తమ పరిధిలో లేని దరఖాస్తులను పై స్థాయికి పంపించాలని తెలిపారు. రైతులు భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులలో దరఖాస్తులు సమర్పించాలని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తమ భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు. కార్యకరమంలో తహసీల్దార్ కవిత, సర్వేయర్ రామకృష్ణ, గిర్దావర్ మాజీద్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వ్యవసాయ పనులు

కెరమెరి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యవసాయ పనులు కొనసాగుతున్నాయి. రైతులు దుక్కులు పూర్తయిన భూముల్లో పత్తి గింజలు పెడుతున్నారు. మృగశిరకార్తె ప్రారంభమై తొలకరి పలకరించడంతో రైతులు పత్తి, కంది విత్తనాలను తమ తమ వ్యవసాయ చేలల్లో నాటుతున్నారు. మండల వ్యాప్తంగా 29 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారు. ఇప్పటికే కొందరు పత్తి, కంది విత్తనాలు పెట్టారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి

కౌటాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలని ఎంఈవోహనుమంతు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజన, పారిశుధ్య కార్మికులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంట వండే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్పీ శ్రీనివాస్, సీఆర్పీలు, ఎంఐఎస్ కో ఆరినేటర్, సీసీవోలు తదితరులు పాల్గొన్నారు.

డీఏవీ లక్ష్మీపత్ సింఘానియా పబ్లిక్ స్కూల్ ప్రారంభం



హోమం నిర్వహిస్తున్న యాజమాన్య ప్రతినిధులు

కాగజ్‌నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో డీఏవీ లక్ష్మీపత్ సింఘానియా పబ్లిక్ స్కూల్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ పాఠశాలలో హోమం నిర్వహించారు. అనంతరం డీఏవీ సౌత్‌జోన్ ఏఆర్‌వో కె ఆనందవల్లి, పాఠశాల చైర్మన్ ఏకేమిశ్రా మాట్లాడుతూ ఈ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యను అందిం చేందుకు పాఠశాలను ప్రారంభించామని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చైర్మన్ సతీమణి అను, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాలొన్నారు.

కలెక్టర్, జడ్జిని కలిసిన ఎస్పీ

ఆసిఫాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ ఎస్పీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా కోర్టులో ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎంవీ రమేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు వారికి పూల మొక్కను అందజేశారు. ఈ సంద ర్భంగా పలు విషయాలపై వారు చర్చించారు.



జడ్జికి పూలమొక్క అందజేస్తున్న ఎస్పీ పాటిల్ కాంతిలాల్ సుభాష్

మంత్రి వివేక్‌కు పుష్పగుచ్ఛం అందజేత

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన గడ్డం వివేక్ వెంకటస్వామిని బుధవా రం హైదరాబాద్‌లో బీజేపీ సీనియర్ నా యకుడు అరిగెల నాగేశ్వర్‌రావు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగు చ్ఛం అందజేసి శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంట పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

ఎస్పీని కలిసిన నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పాటిల్ కాంతిలాల్ సుభాష్‌ను బుధవారం డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ క్యాక్రమంలో నాయకులు విశ్వనాథ్, చరణ్, అసద్, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

జైనూర్, జూన్ 11 (ఆంధ్రజోతి): మండల కేంద్రంలోని మోయిన్‌పురతో పాటు పొలాస, జంగాం గ్రామాల్లో ప్రజల తాగునీటి సమస్యను ఎమ్మెల్యే పరిష్కరించారు. ఈ కాలనీలో సుమారు 300 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఒకే ఒక చేతి పంపు ఉండడంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే కోవ లక్ష్మికి విజ్ఞప్తి చేశారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి మండలంలోని పొలాస, జంగాం, మండల కేంద్రంలోని మోయిన్‌పురకు బోరు బావులు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్‌తో ఎవరి హక్కులకు నష్టం వాటిల్లదు

ఆసిఫాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ ఏర్పాటుతో ఎవరి హక్కులకు ఎలాంటి నష్టం వాటిల్లదని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రెవాల్ అన్నారు. జిల్లా అటవీశాఖ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకురుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ ఏర్పాటుపై ప్రజలకు ఎన్నో అపోహాలు, అనుమానాలు ఉన్నాయన్నారు. టైగర్‌జోన్ వేరని, టైగర్ కన్జర్వేషన్ వేరని స్పష్టం చేశారు. టైగర్ కన్జర్వేషన్ ఏర్పాటు ద్వారా భూములు, గ్రామాలు, రోడ్లకు ఎలాంటి నష్టం వాటిల్లదన్నారు. జిల్లా 2014 నుంచి టైగర్ కారిడార్‌లోనే కొనసాగుతుందని చెప్పారు. జిల్లాలోని గిన్నెధరి, జోడేఘాట్ అటవి రేంజ్‌లు 2012 నుంచి టైగర్‌జోన్‌లో ఉన్నాయని తెలిపారు. ఆయా రేంజ్‌ల పరిధిలో ఎలాంటి పరిమితులు విధించలేదని గుర్తు చేశారు. జిల్లాలో టైగర్ కన్జర్వేషన్ ఏర్పాటుతో ఏకో టూరిజం అభివృద్ధి చెందుతుందన్నారు. పక్కనే ఉన్న తడోబా టూరిజం ద్వారా ఆ రాష్ట్రానికి ఏడాదికి రూ. 500 కోట్ల ఆదాయం సమకూరుతోందని వివరించారు. ఎంతో మంది పర్యాటకులు సందర్శిస్తుంటారన్నారు. అలాగే మన జిల్లాలో కూడా ఆదాయం సమకూరి ఈ ప్రాంత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లబిస్తాయన్నారు. ఎనిమల్ ట్రాకర్స్ గైడ్స్, సఫారి డ్రైవర్స్ లాంటి ఉద్యోగాలు స్థానికులకు అందుబాటులోకి వస్తాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అధిక నిధులు సమకూరుతాయని చెప్పారు. ఇలా విడుదలైన నిధులతో రోడ్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని టైగర్ కన్జర్వేషన్ ఏర్పాటుతో గ్రామాలను ఖాళీ చేయించడం కానీ, భూములు తీసుకొవడం కానీ ఎట్టి పరిస్థితుల్లో జరుగదన్నారు. ఎవరి హక్కులకు భంగం కలగదని ఎలాంటి పరిమితులు షరతులు ఉండవని చెప్పారు. ప్రజలు అపోహలను నమ్మవద్దని డీఎఫ్‌వో తెలిపారు.



మాట్లాడుతున్న డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రెవాల్

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సీతారాం, పాల్గొన్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న ఏఎన్‌ఎంలు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి సీతారాం, డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని పోస్ట్ మెట్రిక్ హాస్టల్ బాలికల పాఠశాలలో ఏఎన్‌ఎంలకు బుధవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంతో పాటు వసతి గృహాల్లో పరిశుభ్రత, విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. సీజనల్, ఇతర వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తరుచూ ఆరోగ్య పరీక్షలు చేస్తూ సూచనలు చేయాలని అయన సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన స్కెతస్కోపులను ఏఎన్‌ఎంలకు అందజే శారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, జీసీ డీవో శకుంతల, ఏటీడీవోలు ఖమర్‌హుస్సేన్, చిరంజీవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

జైనూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణకు టీపీసీసీ కార్యదర్శి పదవి దక్కడంతో బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బుధవారం స్థానికంగా ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్, నాయకులు పెందుర్ ప్రకాష్, కొట్నాక దౌలత్‌రావ్, అజ్జులాల, బాబు పఠాన్, గేడాం గోపిచంద్, కోటేష్, ఇస్లాం తదితరులు పాల్గొన్నారు.



ఆత్రం సుగుణను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మూతపడిన ఉపరితల గనుల తనిఖీ

రెబ్బెన, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మూతబడిన డోర్లి-1, డోర్లి-2 ఉపరితల గనులను బుధవారం ప్రొఫెసర్ డాక్టర్ శ్రీ సుదిప్త ముఖోపాధ్యాయ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మూతబడిన ఉపరితల గనులను తనిఖీ చేశారు. అలాగే బొగ్గు డంప్ యార్డులపై, ఇతర ప్రదేశాలపై నాటిన మొక్కలను పరిశీలించారు. అనంతరం జీఎం విజయ్ భాస్కర్‌రెడ్డిని కలిశా రు. ఆయన వెంట ఎస్‌ఓటు జీఎం కె.రాజమ ల్లు, కార్పొరేట్ అధికారులు ఉన్నారు.



గనులను పరిశీలిస్తున్న ప్రొఫెసర్ సుదిప్త ముఖోధ్యాయ్, అధికారులు

స్కావెంజర్లకు ఒక రోజు శిక్షణ



సూచనలు ఇస్తున్న ఎంఈవో వాసాల ప్రభాకర్

కాగజ్‌నగర్ టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలోని పాఠశాలల్లో పని చేస్తున్న స్కావెంజర్లకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. స్థానిక ఎంఆర్‌సి భవనంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంఈవో వాసాల ప్రభాకర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో పచ్చద నం-పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రాజమణి, కమల, కాంత పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పరిసరాలను పరి శుభ్రంగా ఉంచాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో స్కావేంజర్లకు బుధవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా బుద్ధ పూర్ణిమ

సిర్పూర్(టి), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బుద్ధ పూర్ణిమ సందర్భంగా సిర్పూర్(టి) మండల కేంద్రంలోని నాగమ్మ చెరువులో గల బుద్ధుడి విగ్రహం వద్ద బుధవారం శ్రామినేర్లు, ఉపాసక్, ఉపాసికలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధమ్మ దాన్ పెట్టెలోని ధనంను బౌద్ధ బంధువుల సమక్షంలో లెక్కించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ తాలూకా అధ్యక్షుడు విక్రం, దేవాజీ, శివరాం, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ

దహెగాం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎరువులు పంపిణీ చేశారు. అయినం, ఒడ్డుగూడ, హత్తిని, లగ్గాం, దహెగాం గ్రామాల్లోని రైతులు తరలివచ్చి ఎరువులను తీసుకువెళ్లారు.

దహెగాం (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మునావర్‌షరీఫ్‌ను బుధవారం కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, శ్రీనివాస్, తోగేష్ పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, అంధ్రజ్యోతి): మండలంలోని బాలాజీ అనుకోడలో బడిబాటలో భాగంగా ర్యాలీ నిర్వహజించారు. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ఎంఈవో జయరాజ్ కోరారు.

రెబ్బెన, (అంధ్రజ్యోతి): ఇటీవల డాక్టరేట్ పొందిన నారాయణపూర్‌కు చెందిన సామాజిక కార్యకర్త కొండగుర్లే కమలాకర్‌ను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కో కన్వీనర్ రవీందర్, సామాజిక కార్యకర్త శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వట సావిత్రి వ్రతం



బెజ్జూరులో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఆసిఫాబాద్‌రూరల్/బెజ్జూరు జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జేష్ఠ పౌర్ణిమను పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని పలు కాలనీలో మహిళలు మర్రి చెట్టు వద్ద వట సావిత్రి వ్రతం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణవాడలోని మినీ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక మర్రి మొక్కను ఏర్పాటు చేసుకొని మహిళలు వత్రాన్ని ఆచరించారు. బెజ్జూరు మండల కేంద్రంలో మహిళలు వటసావిత్రి పౌర్ణమి సందర్భంగా మర్రిచెట్టు వద్ద పూజలు నిర్వహించారు.